# మక్కలకు.. మద్దతిస్తాం!

## రైతులకు అండగా ప్రజాప్రభుత్వం

- కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**వాస్తవ తెలంగాణ:** యాసంగి సీజన్‌లో పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించాలని ప్రజా ప్రభుత్వం డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులు ధర్మపురి నియోజకవర్గంలో 25% అధికంగా మొక్కజొన్న సాగు చేశారన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి మరియు ఎండపల్లి మండలాల్లో సీజన్ లో 4898 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. ఆరు మండలాల్లో సుమారుగా 1.46 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారని, రైతులు పెద్ద ఎత్తున పంట సాగు చేసిన నేపథ్యంలో రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు.

### క్వింటాకు ₹2400 మద్దతు ధర..

రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు ₹ 2400 మద్దతు ధర పొందాలని మంత్రి లక్ష్మణ్ సూచించారు. గడిచిన రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కోత లేకుండా రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్ట్

## రూటు మార్చిన ఈగల్ టీమ్

- 250 మందికి టెస్ట్ నిర్వహిస్తే 180 మందికి పాజిటివ్
- హైదరాబాద్‌లో మొత్తం 1300 మంది రౌడీ షీటర్స్
- వారిలో అత్యధికులు గంజాయికి బానిసలు





**వాస్తవ తెలంగాణ:** హైదరాబాద్ నగరంలో రౌడీ షీటర్‌లపై పోలీసులు, ఈగల్ టీమ్ ఉక్కు పాదం మోపుతున్నాయి. డ్రగ్స్ వాడకంలో, అమ్మకంలో రౌడీ షీటర్‌ల ప్రమేయం ఉందని గుర్తించిన ఈగల్ టీమ్ ఇప్పుడు వారందరికీ డ్రగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రారంభదశలో 250 మంది రౌడీ షీటర్లకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. 190 మంది రౌడీ షీటర్లకు గంజాయి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు రౌడీ షీటర్లకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని వెల్లడించారు. నలుగురితోపాటు, వెస్ట్ జోన్ పరిధి లోని డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన 13 మందిని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక పాజిటివ్ వచ్చిన వారందరిపైనా NDPS యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ఎవరైనా గంజాయి సరఫరా చేసినా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాజిటివ్ వచ్చిన రౌడీ షీటర్లను ఎర్రగడ్డలోని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించనున్నట్లు ఈగల్ టీమ్ ప్రకటించింది.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయండి



**వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి** :పుల్కల్. ఏప్రిల్ 11వ తేదీన నిర్వహించనున్న సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎం.బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్ జోషి హన్మంతు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐబీలో ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ జోషి హన్మంతు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్షపై పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు మరియు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతిని జయప్రదం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కూన సంతోష్, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కశపాగ ఇమ్మయ్య, దళిత జర్నలిస్ట్ ఫోరం దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు తలారి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టు దేవదాసు, చంద్రశేఖర్, మునిపల్లి ఆనంద్, ఎర్రారం దేవదాసు తదితరులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా ర్యాలీలో పాల్గొనాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు ఆహ్వానం

**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ: న్యూస్** ఈనెల 14వ తేదీన జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించనున్న మహా ర్యాలీలో పాల్గొనాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను మీరూ క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు.



# రాత్రింబవళ్లు.. రైట్ రైట్!

## ఆగని ఆకేరు అక్రమ ఇసుక రవాణా

- ఆదిలోనే అటకెక్కిన ప్రభుత్వ ఆన్‌లైన్ విధానం
- అడుగంటుకపోయిన భూగర్భ జలాలు
- చివరికి నీరు అందక బోరుమంటున్న అన్నదాత
- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే అధికారులే లేరా?

**వాస్తవ తెలంగాణ:** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో రాత్రైతే చాలు వందల సంఖ్యలో ఇసుక రవాణా ట్రాక్టర్లు రయ్.. రయ్ అని గ్రామాల్లోని ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిద్ర నటిస్తున్నారు. జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, ముంగిమడుగు శివారు బొడ్డితండ ఆకేరు పరివాహక ప్రాంత రైతులు చివరి వరకు పంట పొలాలకు తడి అందక భూగర్భజలాలు అడుగంటుకు పోయి రాళ్ళు తేలి దర్శన మిస్తున్నా.. కాపాడాల్సిన అధికారులు ముడుపుల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

### అటకెక్కిన ఆన్ లైన్ విధానం..

ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో "మన ఇసుక వాహనం" అనే పేరుతో ఆన్ లైన్ విధానంలో ఇసుక కావాలనుకునేవారు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించింది. కానీ క్షేత్ర స్థాయి లో అమలు చేయాల్సిన అధికారులే ముడుపులకు అల వాటు పడి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్టు స్థానిక పరిస్థితు లు స్పష్టం చేస్తున్నాయి. ఇక. ఆకేరు పరివాహక ప్రాంత రైతులు యా సంగి సీజన్‌లో కోతకు వచ్చే సమయంలో చివరి వరకు వరికి నీరు అంద క వేలాది రూపాయలు ఖర్చు చేసి చెలిమల ద్వారా ఊరిన నీటిని పంట పొలాలకు ఉపయోగిస్తున్నారు.

### గ్రామాల వారీగా అక్రమ వసూళ్లు..

వాగు నుండి ట్రాక్టర్లు బయటికి రావడానికి ఆకేరు పరివాహక ప్రాంత రైతులు కొంత మంది ట్రాక్టర్ కు ₹200 నుంచి ₹ 400వరకు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామంలోని కొంత మంది నాయకులు పంచాయతీల సహకారంతో ₹ 10లక్షలు ₹ 5 లక్షలు టెండర్లు పెట్టి అక్రమంగా వసూలు చేస్తున్న ఘటనలున్నాయి.విషయం అధికారులకు తెలిసినా త లా పాపం తిలా పిడికెడు అన్నట్లు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నా రు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి ఆకేరు వాగులో ఇసుక రవాణా

### ప్రభుత్వ పథకాల పేరుతో..

ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చి సరిపోయేంత ఇసుక నిల్వ చేసుకున్నా కూడా వాటి అనుమతుల పేరుతో ఇసుక మాఫియా పగటిపూట జిల్లా కేంద్రానికి దర్జాగా అక్రమ ఇసుక వ్యాపారం చేస్తోంది. వీటి వెనుక మండల స్థాయి అధికార పార్టీ నాయకులు కొంత మంది అధికారులకు కొమ్ము కాస్తు చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది.

### ఇసుక అక్ర రవాణాను నిలువరించాలి

గ్రామాల్లో వీధుల గుండా వెళ్ళే ట్రాక్టర్ల రద్దీతో రాత్రి వేళల్లో నిద్ర లేకుండా పోతుంది. అధిక స్పీడు, దుమ్ము ధూళితో ఇళ్లన్ని మసకబారి ఆరోగ్యం క్షీణిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్ర రవాణాకు అడ్డుకట్ట వేయాలి.



# ఆదిలాబాద్‌లో.. ఎయిర్ పోర్టు!



### డిఫెన్స్, ఏవియేషన్ సంయుక్త నిర్మాణం

360 ఎకరాల డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్‌కు అనుబంధం..

### మరో 450 ఎకరాల భూమి కావాలన్న రక్షణశాఖ

రక్షణ శాఖ ఆధ్వర్యంలోనే పోర్టు నిర్మాణం.. పౌర సేవలకు అనుకూలంగా ఎన్‌క్లేవ్

విమానయాన శాఖకు రక్షణశాఖ సూచన.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో కేంద్ర మంత్రుల బృందం భేటీ

సంయుక్తంగా నిర్మించేందుకు సూత్రప్రాయ అంగీకారం.. ఈ 17న పరిశీలనకు రానున్న బృందం

డిఫెన్స్ అంగీకారంతో శంకుస్థాపనకు సన్నాహాలు.. అడవుల జిల్లా అభివృద్ధికి మరో ముందడుగు

### హర్షం వ్యక్తంచేస్తున్న ఆదిలాబాద్ జిల్లా ప్రజలు

**వాస్తవ తెలంగాణ:**

ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రక్షణశాఖ ముందుకొచ్చింది. ప్రస్తుతం అక్కడ ఆ శాఖ ఆధ్వర్యంలోని 360 ఎకరాల ఎయిర్ స్ట్రిప్‌కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు అప్పగించాలని సూచించింది. అలా చేస్తే పూర్తిగా తమ శాఖ అధ్వర్యంలోనే ఎయిర్ పోర్టు నిర్మించి పౌరసేవలకు అనుకూలంగా ఒక ఎన్ క్లేవ్ నిర్మించుకోవడానికి పౌరవిమానయానశాఖకు అనుమతిస్తామని రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టంచేశారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు నిర్మాణ అంశంపై కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి, పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు గోడం నగేశ్, పాయల శంకర్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా ఈ మధ్యకాలంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్‌తో చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి రామ్మోహన్ ఈ విషయాలు వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న 165 విమానాశ్రయాలను 2047 నాటికి 350కి పెంచాలన్నది ప్రధానమంత్రి మోదీ లక్ష్యం అన్నారు.

## డిఫెన్స్ నుంచి సూత్రప్రాయ అంగీకారం..



ఎయిపోర్ట్ ఏర్పాటుకు ఆదిలాబాద్‌కు అత్యంత సానుకూల అవకాశాలు న్నాయనీ, వరంగల్, కొత్తగూడెంతోపాటు ఆదిలాబాద్ డిఫెన్స్‌కి సంబంధించిన 360ఎకరాల్లో ఎయిర్ పోర్టు నిర్మించాలని కిషన్ రెడ్డి తనను కోరారని రామ్మోహన్ వివరించారు. దానికి రక్షణశాఖ ఆమోదం కూడా కావాల్సి ఉండటంతో కిషన్ రెడ్డి గతంలోనే రక్షణమంత్రిని కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. దీంతో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి సంయుక్తంగా నిర్మించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని గతంలోనే రక్షణ శాఖ సూత్రపాయ అంగీకార లేఖ ఇచ్చిందన్నారు. అక్కడ ఎయిర్ బస్ తరహా పెద్ద విమానాలు దిగే రన్‌వే నిర్మించాలంటే మరో 450 ఎకరాలు కావాలి. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని వివరించారు.

## 17న క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో రక్షణశాఖ మద్దతు కోరగా రాజ్‌నాథ్ సింగ్ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈనెల 17న పౌరవిమానయాన, రక్షణశాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి ఓఎల్ (అబ్‌స్టకిల్ లిమిటేషన్) సర్వేచేసి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తాయి. రక్షణశాఖ అంగీకరించిన తర్వాత శంకుస్థాపనకు వెళ్తారు. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు అప్పగించాల్సి ఉంది. వీలైనంత త్వరగా శంకుస్థాపన చేసి రెండు, రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తిచేస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌కు 170 కి.మీ. దూరంలో నాగ్ పూర్, 150 కి.మీ. దూరంలో అకోలా ఎయిర్ పోర్టులున్నాయి. హైదరాబాద్ కు రావాలంటే ఏడుగంటలు పడుతోంది. అందువల్ల ఈ ఎయిర్ పోర్టు వేగంగా అభివృద్ధి చెందే అవకాశముందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## పెద్దపల్లి జిల్లాపై ఆశలు..




పెద్దపల్లి జిల్లాలో అంతర్గావ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలం ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం సానుకూలంగా ఉన్నట్లు తాము నిర్వహించిన ప్రీఫీజిబిలిటీ స్టడీలో తేలిందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. నివేదికను ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని, దానిపై వారు తదుపరి నిర్ణయాన్ని చెప్పాల్సి ఉందన్నారు. కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన స్థలం అనుకూలంగా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపితే స్టడీ చేయడానికి సిద్ధమన్నారు. పెద్దవిమానాశ్రయం కోసం సగటున 1200 ఎకరాలు అవసరమవుతుందని.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు, ఏటీసీ, డిఫెన్స్ శిక్షణ సౌకర్యాల నిర్మాణం రక్షణశాఖే చేపడుతుందని, దానివల్ల ఆ ప్రాంతంలో ఉద్యోగాల కల్పన, దేశంలోని వివిధ ప్రాంతాలకు అనుసంధానత ఏర్పడుతుందన్నారు. ఈ ఏడాది చివరికల్లా దేశవ్యాప్తంగా అన్ని ఎయిర్ పోర్టుల్లో ఉడాన్ కేఫేలు ప్రారంభిస్తామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. అయితే ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టుతో ఆదిలాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలెక్టర్ ప్రతిమా సింగ్

క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలి తథ్యం మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** శుక్రవారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రంలోని . ఇందిరా గాంధీ స్టేడియంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా. యో గా కార్యక్రమం ,ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) కు జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అదనపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, డీఎస్పీ ప్రసన్నకుమార్ , జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి వశిష్ట యోగా కేంద్రం ప్రసిద్ధ యోగా గురువులు ఆకుల రవి, పతంజలి యోగ గురువు మనోరంజని, తో కలిసి హాజరై కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువు ఆకుల రవి అధికారులతో ఆసనాలు చేయించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులు పోలీస్ యంత్రాంగం ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు క్రీడాభిమానులతో కలిసియోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు.హా ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన చేయాలన్నారు..పురాతన కాలం నుం చి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యమన్నారు. యోగ అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనంగా గుర్తించబడిందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి, శరీరానికి శక్తి మరియు మనసుకు ప్రశాంతత లభిస్తాయని, యోగా మన శరీరానికి, మనసుకు సమతుల్యతను అందించే సాధనమని తెలిపారు. యోగా సాధన ద్వారా జీవనశైలిలో మార్పు వస్తుందని, అనేక వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు.

ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు మరియు వృద్ధులు యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇతర శాఖల అధికారులు పతంజలి, వశిష్ట యోగా సంస్థ ప్రతినిధులు, క్రీడాకారులు ఇతర ప్రభుత్వ విద్యార్థినిలు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు క్రీడాభిమానులు, తదితరులు



పాల్గొన్నారు.

# కేరళ ప్రభుత్వం పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సరికాదు సి పి ఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట : కేరళలో ఎల్డీఏ ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని కేరళ సీఎం పిన్నరై విజయనిపై సీఎం రేవంత్ ఆరోపణలు సమంజసం కాదని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జాలాలోద్దీన్ అన్నారు. గురువారం సదాశివపేటలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జాలాలోద్దీన్ మాట్లాడుతూ అమెరికా యుద్ధకాండ పై భారత ప్రధానమంత్రి మోడీ ఎందుకు స్పందించడం లేదని గ్యాస్ పెట్రోల్ కొరకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని కి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఇంత జరుగుతున్నా మోడీకి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కేరళ సీఎంను సీఎం రేవంత్ రెడ్డి పదేపదే విమర్శించడం తగదన్నారు. ఎన్నికల ప్రచారం కోసం కేరళ వెళ్ళిన తెలంగాణ సీఎం ఎన్నికల హామీలను అమలు చేశామని చెబుతున్నారని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని అమలు అయ్యాయో తెలుసన్నారు. అత్యంత దుర్భర జీవితాలను అనుభవిస్తూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను పైకి తెచ్చిన చరిత్ర కేరళ ప్రభుత్వాని దని చెప్పారు. కేరళలో నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించడంతోపాటు అక్కడ డిగ్రీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నారని తెలంగాణలో ఎక్కడ ఉచిత విద్య అందుతుందో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, సిపిఐ జిల్లా నాయకులు తాజోద్దీన్, షఫీ అహ్మద్, శంకరప్ప, పాండు, ముస్తఫా, బుజ్జమ్మ, రమేష్, గంగమ్మ, పూలమ్మ, బిపాషా, కళావతి, సాధిక్ అలీ, టాస్లీమా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ వద్దు ఆరోగ్యం ముద్దు

### మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్..

కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా కాప్ర మండలం చర్లపల్లి ఈ సి నాగర్






సెల్ టవర్ వల్ల ఆరోగ్య సమస్యలపై స్పందించిన బొంతు శ్రీదేవి యాదవ్ ఈసీ నగర్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన సెల్ టవర్‌పై కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బొంతు శ్రీదేవి యాదవ్ స్పందించి, సెల్ టవర్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు ఇతర అనర్థాల గురించి సెల్ టవర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్ మరియు వారి బృందానికి వివరించారు. ఈసీ నగర్‌లో సుమారు 70 శాతం మంది సీనియర్ సిటిజన్లు నివసిస్తున్నందున, వారి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని బొంతు శ్రీదేవి యాదవ్ కాలనీ వాసుల సంతకాలను సేకరించి సీఐ కి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై సీఐ సానుకూలంగా స్పందించగా, బోర్డు సభ్యులు ఒక వారం రోజుల గడువు కోరారు. అలాగే కాలనీలో మరో రెండు టవర్స్ కూడా ఇండ్ల మధ్యలో ఉండటంతో, వాటిని కూడా తొలగించేలా చర్యలు తీసుకోవాలని బొంతు శ్రీదేవి యాదవ్ సూచించారు. నివాస ప్రాంతాల్లో సెల్ టవర్స్ ఏర్పాటు చేయకుండా, ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న బొంతు శ్రీదేవి యాదవ్ కి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# అవినీతి కోసమే ఫ్యూచర్ సిటీ

- జీహెచ్ఎంసీలో అవినీతిమయం – కవిత
- రూ.35వేల కోట్ల విలువైన భూముల అమ్మకం
- ఒక్కపైసా కూడా అభివృద్ధికి ఖర్చు చేయని వైనం
- నామినేషన్ పద్ధతిలో టెండర్ల గోల్ మాల్
- హెచ్ఎండీఏకు చైర్మన్‌గా రేవంత్ రెడ్డి

**వాస్తవ తెలంగాణ:** జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు.

## నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్ లు

2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు.

## జీతాలలోనూ కోతే..



నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు.

## 25న పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఈ నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయనను ఎప్పుడో మర్చిపోయారని వ్యాఖ్యానించారు. 'తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను.. ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నానమన్నారు. అయితే, కమీషన్ల కోసమే రిపేర్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామనిపేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా అరైవ్ అలైవ్ వీక్ నిర్వహణ

**రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా**
**అరైవ్ అలైవ్ వీక్లో జిల్లా ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు**





**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి( ఆంజనేయులు)** శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు కొనసాగనున్న అరైవ్ – – అలైవ్ కార్యక్రమాలలో భాగంగా,అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా. అరైవ్ అలైవ్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరైవ్ -- అలైవ్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని సూచించారు. వార్డు సభ్యులు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు సహా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని అన్నారు. 13వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామా కమిటి , రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. అదేవిధంగా రిటైర్డ్ టీచర్లు, డాక్టర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులతో కూడిన రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఈ కమిటీలో కనీసం ముగ్గురు మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని అన్నారు. ఎక్కడైనా రోడ్ల పక్కన గుంతలు,పాడుబడిన బావులు ఉంటే పూడ్చివేయించాలని, ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 15వ తేదీన చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డేగా జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. 16 తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. అలాగే, వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం వంటి వాటి పై అవగాహన కల్పించాలన్నారు.ప్రమాదాల నివారణకు కృషి చేసిన వారిని గుర్తించి సన్మానించాలని సూచించారు. 18వ తేదీన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించే వారిని గుర్తిస్తూ, వారికి కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. ఈ నెల 16న మండల స్థాయిలో నిర్వహించే ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక సభల్లోనూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రధాన కూడళ్ళలో మానవహారాలు జరపాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. జిల్లా ఎస్ పి డి. వి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి, సైన్ బోర్డ్స్, ఏర్పాటు పై పి పి టి ద్వారా వివరించారు. అలైవ్ అరైవ్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికి రోడ్డు సేఫ్టీ పై అవగాహనా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఎక్కువగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ,రెవిన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రవాణా అన్ని శాఖల జిల్లా అధికారులు పోలీసు యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లోని షాపింగ్ కాంప్లెక్స్ ను స్థానిక నిరుద్యోగ యువతి యువకులకు 50% కేటాయించాలి - వి.ఎస్.బోస్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు







**ఉప్పల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డిగ్నిటీ హోసింగ్ కాలనీ లోని డబల్ బెడ్ రూమ్స్ ఇళ్లల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ లను సిపిఐ ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వి .ఎస్ .బోస్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి కావడంతో స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతీ యువకులకు గృహ సముదాయ లోని వాణిజ్య నీకి ఉపయోగపడే దుకాణాలను కేటాయించాలని వి.ఎస్.బోస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై మేడ్చల్ జిల్లా యంత్రాంగం సంబంధిత ఉన్నత అధికారులు తగు చర్యలు చేపట్టాలని వారు సూచించారు, 50% స్థానిక నిరుద్యోగ యువతి యువకులకు మరియు 25% వికలాంగులు కు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి .దామోదర్ రెడ్డి సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి కార్యవర్గ సభ్యులు, టి .సత్య ప్రసాద్ సిపిఐ ఉప్పల్ మండల్ కార్యదర్శి, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఏం.చంద్రశేఖర్ ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు వికాస్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, మోహన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనర్జీ.. లాక్‌డౌన్!

## చమురు, గ్యాస్ కొరత



### అల్లాడిపోతున్న చిన్న దేశాలు
### ప్రతి బుధవారం మార్కెట్లకు సెలవు
### ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్
### కఠిన రూల్స్ పాటిస్తున్న పొరుగు దేశాలు

**వాస్తవ తెలంగాణ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా ఇరాన్ అమెరికా మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ అక్కడి పరిస్థితి యుద్ధ వాతావరణాన్నే తలపిస్తోంది. లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులు ముమ్మరం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హార్మూజ్ జల సంధిని మరోసారి మూసేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు మరోసారి భారీ షాక్ తగిలింది. హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసి వేసిన నేపథ్యంలో అక్కడి వరకూ వెళ్లిన నౌకలను తిరిగి బలవంతంగా వెనక్కు మరలిస్తున్నట్లు అంతర్జాతీయ కథనాల ద్వారా వెల్లడి అవుతుంది. అయితే చమురు సంక్షోభం నుంచి బయట పడేందుకు ఆసియాలోని అనేక దేశాలు వివిధ రూల్స్ ను పెట్టుకుని అమలు చేస్తున్నాయి. పాకిస్థాన్‌లో ఇప్పటికే ఎనర్జీ లాక్ డౌన్ నడుస్తోంది. దాంతో దేశవ్యాప్తంగా మార్కెట్లు, షాపింగ్ మాల్స్ రాత్రి 8 గంటల కల్లా క్లోజ్ చేస్తున్నారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్, పాఠశాలలకు సెలువులు ఇచ్చారు. ఇక శ్రీలంకలో పరిస్థితి మరోవిధంగా ఉంది. ఇంధన సంక్షోభంలో శ్రీలంకలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంధనం, విద్యుత్ ను ఆదా చేసేందుకు అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి బుధవారం సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ప్రజలు వాహనాల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచనలు చేసింది. అంతేకాక ప్రైవేట్ వాహనాలకు ఇంధనాన్ని రేషనింగ్ చేస్తోంది.








## ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్..

అలాగే మరో దేశం ఫిలిప్పీన్స్ ను కూడా పశ్చిమాసియా యుద్ధం తాకింది. ఫిలిప్పీన్ దేశం దాదాపు 98 శాతం దిగుమతులపైనే ఆధార పడుతుంది. దాంతో దేశంలో ప్రస్తుతం ఎనర్జీ ఎమర్జెన్సీ విధించారు. దేశంలోని విద్యుత్ ఉత్పత్తికి అవసరం అయిన గ్యాస్ నిల్వలు పూర్తి కావడంతో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇక వియత్నాం కూడా తమ దేశ పౌరులపై పలు ఆంక్షలు విధించింది. ఈ దేశంలో పెట్రోల్ ధరలు 60 శాతానికి పెరిగాయి. దాంతో అనవసర ప్రయాణాలను అక్కడి ప్రభుత్వం నిషేధించింది. కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచనలు చేసింది. మయన్మార్ లో కూడా ప్రజలు చమురు కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. దాంతో మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆడ్ ఈవెన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానం వల్ల నిర్దేశించిన రోజుల్లోనే వాహనాలు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. అలాగే భారత్ కు సరిహద్దు దేశమైన బంగ్లాదేశ్ లోనూ ఆంక్షలు భారీగా విధించారు. అక్కడ విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తూ లోడ్ షెడ్డింగ్ అమలు చేస్తున్నట్లు సమాచారం. ఈ దేశాలతోపాటు జర్మనీ, దక్షిణాఫ్రికా కూడా ఇదే విధానంలోకి జారుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక భారత్ లో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది.



# బ్యాంకులకు.. కిల్ స్విచ్!

## ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట

- కొత్త విధానం అందుబాటులోకి తీసుకురానున్న ఆర్బీఐ
- ₹10 వేలు యూపీఐ ద్వారా పంపితే గంట పాటు హోల్డ్
- ₹50 వేలకు మూడో వ్యక్తి అప్రూవల్ అవసరం
- అభిప్రాయాలు సేకరిస్తున్న రిజర్వ్ బ్యాంక్




**వాస్తవ తెలంగాణ:** ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి రిజర్వ్ బ్యాంక్ నూతన విధానాన్ని అమలు చేయనుంది . ఇకపై మీరు ఎవరికైనా ఫోన్ పే లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా 10 వేల రూపాయల కంటే ఎక్కువ పంపితే, ఆ డబ్బు వెంటనే అవతలి వారికి చేరదు. కనీసం ఒక గంట పాటు ఆ డబ్బు హోల్డ్‌లో ఉంటుంది. ఈ లోపు మీకు ఏదైనా అనుమానం వచ్చినా లేదా పొరపాటున పంపామని అనిపించినా ఆ ట్రాన్సాక్షన్‌ను వెంటనే క్యాన్సిల్ చేసేసుకోవచ్చు. సైబర్ నేరగాళ్లు మనల్ని బురిడీ కొట్టించి డబ్బులు లాగేసుకున్నప్పుడు, అవి వారి ఖాతాలో పడకముందే ఆపుకోవడానికి ఈ గంట విరామం బాగా పనికొస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న పెద్ద పెద్ద మోసాలన్నీ 10 వేల పైబడిన లావాదేవీల్లోనే ఉంటున్నాయని ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

### 50 వేల కంటే ఎక్కువ డబ్బు..

సీనియర్ సిటిజెన్స్ , దివ్యాంగులు సైబర్ మాయగాళ్ల చేతిలో త్వరగా చిక్కుతారని భావించిన ఆర్బీఐ, వారి కోసం నమ్మకస్తుడైన వ్యక్త అనే ఇంకో రక్షణను తెస్తోంది. దీని ప్రకారం.. వృద్ధులు 50 వేల కంటే ఎక్కువ డబ్బు ఎవరికైనా పంపాలంటే, వారు ముందుగా చెప్పుకున్న ఒక నమ్మకమైన వ్యక్తి కూడా దాన్ని ఓకే చేయాల్సి ఉంటుంది. అలాగే, మీ అకౌంట్‌లో ఏదైనా తేడా జరుగుతోందని అనిపిస్తే, ఒక్క సెకనులో మీ డిజిటల్ సేవలన్నీ ఆపేసే "కిల్ స్విచ్" అనే బటన్‌ను కూడా బ్యాంకులు అందుబాటులోకి తేవాలి. దీన్ని ఒక్కసారి నొక్కితే చాలు, మీ అకౌంట్ నుంచి రూపాయి కూడా కదలదు.

### అయితే కంగారు పడకండి..

మీరు షాపుల్లో సామాన్లు కొన్నప్పుడు లేదా నెలనెలా కట్టే కరెంటు బిల్లులు, ఇన్సూరెన్స్ వంటి వాటికి ఈ గంట నిరీక్షణ ఉండదు. మీరు ఎప్పుడూ పంపే నమ్మకస్తుల పేర్లను ముందే లిస్టులో పెట్టుకుంటే వారికి కూడా వెంటనే డబ్బులు వెళ్తాయి. అలాగే, అకౌంట్లలోకి వచ్చే డబ్బుపై కూడా నిఘా పెడుతున్నారు. ఏడాదికి 25 లక్షల కంటే ఎక్కువ డబ్బు అకౌంట్ లోకి వస్తే, బ్యాంకులు ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీశాకే ఖాతాలోకి మళ్లిస్తాయి. ఈ కొత్త రూల్స్‌పై మే 8 వరకు ప్రజల సలహాలు తీసుకుని, ఆ తర్వాతే వీటిని అమలు చేస్తారు.

## ధాన్యం ఉత్పత్తి, కేటాయింపుల వ్యత్యాసాన్ని తగ్గించండి

హైదరాబాద్ **వాస్తవ తెలంగాణ:** రాష్ట్రంలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, కేంద్రం కేటాయిస్తున్న ధాన్యం సేకరణకు మధ్య నెలకొన్న వ్యత్యాసాన్ని తగ్గించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం ఆయన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి డిమాండ్లతో కూడిన లేఖ రాశారు. రైతులు నష్టానికి లోనుకాకుండా కాపాడుతూనే, అదనపు నిల్వలను నిర్వహించడంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఎఫ్‌సీఐ ముడి బియ్యం లక్ష్యాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. రబీ సీజన్‌కు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉడికించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 8.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా సరఫరా కావాల్సి ఉందని పేర్కొన్నారు. దీని గడువు ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసిపోయిందని తెలిపారు. తేమ స్థాయి తక్కువగా ఉన్న దానిని ఉడకబెట్టిన బియ్యంగా మార్చేందుకు కేంద్రం అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు కేవలం ఐదు శాతం మాత్రమే సరఫరా చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారనీ, దాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. డిసెంబర్ 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఖరీఫ్, రబీ సీజన్ రెండింటిలోనూ వరి ఉత్పత్తిలో గణనీయంగా పెరిగిందని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందించడం, నష్టానికి అమ్ముకోకుండా నివారించేందుకు వికేంద్రీకృత సేకరణ పథకం కింద భారత ప్రభుత్వం తరపున వరిని సేకరిస్తోందని గుర్తు చేశారు. అయితే, కస్టమ్ మిల్డ్ రైస్, ఉడకబెట్టిన బియ్యం లక్ష్యాలను తగ్గించాలన్న కేంద్ర నిర్ణయంతో తెలంగాణ అదనపు నిల్వలు, నిల్వ ఖర్చులు, మిల్లింగ్ ఖర్చులు, వడ్డీ బాధ్యతలతో సతమతమవుతోందని గుర్తు చేశారు. లక్షలాది మంది రైతులను కాపాడేందుకు సేకరణ కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల

హైదరాబాద్ :**వాస్తవ తెలంగాణ** మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎమ్‌హెచ్‌ఎస్‌ఆర్‌బీ) 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను గురువారం విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన వారి సెలక్షన్ లిస్టును బోర్డు వెబ్‌సైట్‌లో (https://mhsrb.telangana.gov.in/Home) అభ్యర్థులకు అందుబాటులో ఉంచింది. పారదర్శకత కోసం పరీక్ష రాసిన సుమారు 42 వేల మంది అభ్యర్థుల పూర్తి వివరాలను పొందుపర్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన విషయంలో తెలిసిందే. తాజా పోస్టుల భర్తీతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత పూర్తిగా తీరిపోయినట్టేనని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. వైద్యారోగ్య శాఖలో మరో 4500 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ నిరంత పర్యవేక్షణ, కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టితో ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీలో వేగం పుంజుకున్నది.

## కుషాయిగూడ లో జన సేనా పార్టీ శివ కార్తీక్ ఆధ్వర్యాలో చలివేంద్రం ఏర్పాటు.. ముఖ్య అతిథిగా గాధం శివ








**వాస్తవ తెలంగాణ న్యూస్/** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు ఉప్పల్ నియోజకవర్గం కుషాయిగూడ డివిజన్ లోపల కుషాయిగూడ బస్ స్టాప్ దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. పార్టీ ప్రదాత గాదం శివ ముఖ్యఅతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉప్పల్ నియోజకవర్గం కో ఇన్చార్జ్ కే శివ కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి రావు ఐ నాగరాజు కే శేషు భాస్కర్ రావు రాము భీమ్ సత్య రావు రాంబాబు శేఖర్ జన సైనికులు మరియు పార్టీ మద్దతుదారులు పాల్గొన్నారు..

## నేషనల్ హైవే రోడ్డుపైకి వస్తుందని స్కూల్ బిల్డింగ్ కులగొట్టిన అధికారులు పరిశీలించిన సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ:న్యూస్** నేషనల్ హైవే రోడ్డుపైకి వస్తుందని స్కూల్ బిల్డింగ్ గులగొట్టిన అధికారులు సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ సందర్శించి 1974ఢ75 సమయంలో నిర్మించిన జిల్లా పరిషత్ హై స్కూల్ ను కబ్జా కోరల మాటలు విని కూల్చివేసిన అధికారు లు ఈ స్కూల్లో ఈ ప్రాంత సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ప్రజెంట్ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ మరియు ఎంతోమంది అధికారులు స్కూల్లో చదువుకొని గౌరవపదమైన పదవుల్లో ఉన్నారు అయినా ఈ స్కూల్ గురించి పట్టించుకునే నాథుడే లేరు. అయినా ఎట్టి పరిస్థితిలో భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ మరియు పట్టణ నాయకులు వదిలి పెట్టేది లేదని జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి బైండ్ల కుమార్ ప్రసాద్ శివ కుమార్ యాదవ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


## కాలు విరిగి బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించిన పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్




**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ: న్యూస్** ప్రమాదవశాత్తు కాలు విరిగి బాధపడుతున్న జెపి కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడ కాలనీవాసులను పరామర్శించిన పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్. జేపీ కాలనీ డివిజన్ పరిధి లోని బండ్లగూడ వాస్తవ్యులు షబ్బెర భర్త జబ్బర్ ఖాన్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి మొదటి అంతస్తు నుంచి కింద పడడం వల్ల కాలు విరిగి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జబ్బర్ ఖాన్ ను వారి నివాసంలో కలిసి పరామర్శించడం జరిగింది. కాలు విరిగినందువల్ల సరైన వైద్యం తీసుకొని త్వరలో కోలుకోవాలని మెట్టు కుమార్ యాదవ్ ధైర్యం ఇవ్వడం జరిగింది. అనంతరం వడ్డే గోపాల్ ప్రమాధవశాత్తు కాలు విరిగి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు. కాగా మెట్టు కుమార్ యాదవ్ గోపాల్ ను వారి నివాసంలో కలిసి పరామర్శించడం జరిగింది. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, తీసుకుంటున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ సమయానికి మందులు వేసుకుని త్వరగా కోలుకోవాలని మెట్టు కుమార్ యాదవ్ కోరారు.

# కొత్త రోడ్డు ఆది లోనే బీటలు... అధికారులు, స్థానిక నాయకుల నిర్లక్ష్యం బహిర్గతం ప్రజల పాట్లు...

---ప్రారంభంలోనే పగుళ్లు... నాసిరకం పనులపై అనుమానాలు
---భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదం మరింత తీవ్రం
---వెంటనే స్పందించకపోతే పెద్ద ప్రమాదం తప్పదని హెచ్చరిక





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా ఎమ్మార్వో కార్యాలయం నుండి ఎల్లారెడ్డి గూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభంలోనే బీటలు వారడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే రోడ్డు మధ్యలో పెద్ద పగుళ్లు ఏర్పడి కాంక్రీట్ పలకలు పైకి లేచిన దృశ్యాలు నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ రహదారి మీద రోజూ భారీ వాహనాలు, ట్రక్కులు నిరంతరం ప్రయాణిస్తున్నాయి. దీంతో ఇప్పటికే దెబ్బతిన్న రోడ్డు ఎప్పుడైనా పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం కనీసం పరిశీలనకైనా రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పనులు పూర్తయ్యాక కూడా పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేయడంతో పాటు భారీ వాహనాల రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని, ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# మరోసారి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు భారీగా నిధుల మంజూరు..!

## కాలనీ వాసులకు ప్రొసీడింగ్స్ అందచేసినా పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. ఏకంగా రూ.1కోటి నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ,సీసీ రోడ్లు అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కి, ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తున్న మందుముల పరమేశ్వర్‌రెడ్డికి ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మిగతా కాలనీలలో అభివృద్ధి పనులకు కూడా భారీ నిధులను మంజూరు చేయించ నున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి చెప్పారు .మేడ్చల్ మల్కాజ్గిరి కార్పొరేషన్ లోనే వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టుగా తెలిపారు. మంజూరైన నిధులు.. చేపట్టబోయే పనుల వివరాలు.. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ లోని శ్రీనివాసపురం కాలనీ, స్ట్రీట్ నంబర్ 3 లో రూ.20లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం. శ్రీనివాస్ పురం కాలనీ లో రూ.20 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణం. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్ కాలనీ స్ట్రీట్ నంబర్ 9,8,3,లో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ విజ్ఞాన్ జోతి హైస్కూల్ నుండి వాసవి నగర్ స్ట్రీట్ నంబర్ 1 వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. మంజూరు చేయించి నాలుగు కాలనీల అసోసియేషన్ ప్రతిని ధులకు నిధుల మంజూరు పత్రాలను పరమేశ్వర్ రెడ్డి అయా కాలనీ వాసులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో రామ్ రెడ్డి నగర్,వెంకట్ రెడ్డి నగర్,వాసవి నగర్ కాలనీ,శ్రీనివాస్ పురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పంప్డ్ స్టోరేజీ విద్యుత్ వైపు సర్కార్ దృష్టి




**వాస్తవ తెలంగాణ** కేంద్ర మార్గదర్శకాలు, ఫ్రీ పొల్యూషన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టింది. పారిస్ ఒప్పందం ప్రకారం విద్యుత్ అవసరాల్లో 2030 నాటికి 50 శాతం, 2070 నాటికి 100 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాల్సి ఉంటుంది. దానికి తోడు తెలంగాణ భవిష్యత్ అవసరాలకు ఇంధన కొరత రాకుండా ఉండేందుకు జీరో పొల్యూషన్ ప్రాతిపదికన కొత్త విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్(పీఎస్‌హెచ్)ల వైపు సర్కార్ దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొండలు, గుట్టలను ఆనుకుని ఉన్న రిజర్వాయర్లు, నదులు గల 23 ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. మొదటి దశలో 12 ప్రాంతాల్లో తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టీఎస్‌జెన్కో), సింగరేణితో పాటు పలు ప్రయివేట్ సంస్థలు ఈ రంగంలో కొత్తగా విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

**ఊరగొండ మల్లేశం**

కొత్త గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా పంప్డ్ స్టోరేజీ హైడ్రో (పీఎస్‌హెచ్), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్), ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ రంగంలో 10వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో పీఎస్ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర వ్యాప్తంగా 23 ప్రాంతాలు అనుకూలమని గుర్తించారు. మొదటి దశలో 12 ప్రాంతాల్లో 3,400 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులను 2030 వరకు ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఎత్తైన కొండలు, గుట్టలను ఆనుకుని ఉన్న రిజర్వాయర్లు, నదులు ప్రవహించే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కొన్ని ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు ఈ రంగంలో ప్రాజెక్టులు నిర్మించేందుకు సర్కార్‌తో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. బొగ్గు మైనింగ్ ప్రాంతాల్లోని నీటిని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సింగరేణి సంస్థ భావిస్తోంది.

# నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్





**నర్సాపూర్ వాస్తవ తెలంగాణ:**నర్సాపూర్ మండలం రామచంద్రాపూర్ గ్రామంలో బుడ్డ లక్ష్మి మరియు తిరుమలాపూర్ గ్రామంలో ఓంకార్ నాయక్ నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెల్పిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్.ఈ సందర్భంగా మాట్లతుడు ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యం అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా మా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా స్థిరమైన నివాసం కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొదటి విడత 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని,ప్రతి గ్రామంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు ఉండాలి..ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను గ్రామ సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పర్యవేక్షించాలని, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగహన కల్పించి నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ నరేందర్, సుధాకర్,వార్డు సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

# మియాపూర్ బస్ డిపో 2 వద్ద నిర్వహించిన డా బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ:న్యూస్** మియాపూర్ బస్ డిపో 2 వద్ద నిర్వహించిన డా బి.ఆర్ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి , శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్.అంబేద్కర్ కేవలం ఒక కులానికో, వర్గానికో పరిమితమైన నాయకుడు కాదు, ఆయన దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి...చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి.భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు డా. బి.ఆర్.అంబేద్కర్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్. మియాపూర్ బస్ డిపో వద్ద ఆర్.టి.సి యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు మరియు ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీజేపీ ఎస్సీ మోర్చ అధ్యక్షులు కాంతి కిరణ్,ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు కాంచన కృష్ణ, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ఫౌండర్ థామస్, యూనియన్ సెక్రటరీ యాదయ్య, విజిలెన్స్ ఆఫీసర్ మహంకాళి, డిపో మేనేజర్ వెంకటేష్, డిపో సెక్రటరీ లక్ష్మయ్య , ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు నాగరాజు, జిల్లా కార్యదర్శి మాణిక్ రావు గార్లతో కలిసి పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు డా. బి.ఆర్ అంబేదర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించడం మనకు ఎంతో గర్వకారణమన్నారు, అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సిద్ధాంతమని, ఆయన మనకు సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలను అందించిన మహనీయుడని , శిక్షణ పొందండి, పోరాడండి, సంఘటితమవండి అనే ఆయన సందేశం నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి ఆయన చేసిన కృషి అపారమైనదని , అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు, ఆయన విగ్రహం ఒక శిల్పం కాదని, ఆయన ఆశయాలకు ప్రతీకని, ఆయన జీవితం దేశానికి ఆదర్శమని, అంత గొప్ప వ్యక్తిని ఓడగొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని,అనేక రకాలుగా వివక్షకు గురిచేశారన్నారు, దేశం మంతా ఒక్కటిగా ఉండాలనే ఆయనే సిద్ధాంతాలను అమలు చేస్తున్నది ఒక్క బీజేపీ మాత్రమేనని, మన కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడమే కాకుండా అత్యున్నత పురస్కారం భారతరత్న ఇచ్చి ఆయనకు గౌరవించిందన్నారు,2018 లో ఆగిపోయిన విగ్రహ ఆవిష్కరణ మరల ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, పాల్గొన్న అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేశ్వర్ గౌడ్, మహేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, వేణు గోపాల్ యాదవ్, గణేష్, విజయేందర్, పద్మ, శ్రీనివాస్ యాదవ్, జె.శ్రీనివాస్, సురేష్, రాము, శ్రీనివాస్, చందు, ఆంజనేయులు, పట్టాభిరామ్, భాష శివా, మన్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్







**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ: న్యూస్** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై..ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ప్రమాదానికి గురైన కార్మికుడికి ఆపన్నహస్తం అందించిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి



**బొల్లారం వాస్తవ తెలంగాణ: న్యూస్** బొల్లారం 272 డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తీలో గత 20 ఏళ్లుగా నివాసముంటున్న రామారావు అనే కార్మికుడు ప్రమాదానికి గురవగా, స్థానిక నాయకులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఆంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చి ఇక్కడ జీవనోపాధి పొందుతున్న రామారావు, ప్రతిరోజూ లాగే ఉదయం 8 గంటలకు సైకిల్‌పై విధి నిర్వహణకు బయలుదేరారు. మార్గమధ్యలో రెండు బర్రెలు పోట్లాడుకుంటూ వెనుక నుండి వచ్చి ఆయన సైకిల్‌ను బలంగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో రామారావు తలకు తీవ్ర గాయమైంది. స్థానిక ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని, పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే, ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు ఆయనను ఇంటికి తీసుకువెళ్లారు.విషయం తెలుసుకున్న రామారావు భార్య జగదంబ, వెంటనే బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి కి ఫోన్ చేసి సాయం కోరారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఆనంద్ కృష్ణారెడ్డి, స్వయంగా వారి ఇంటికి వెళ్లి రామారావు పరిస్థితిని గమనించారు. వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అంతేకాకుండా, తక్షణ ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ. 5,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. “తోటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు ఆదుకోవడమే నిజమైన నాయకత్వం. ఒక పేదవాడు ఆపదలో ఉంటే నేను చూస్తూ ఊరుకోలేను. వారికి న్యాయం జరిగే వరకు నా వంతు పోరాటం చేస్తాను. పుట్టినప్పుడు ఏమీ తీసుకురాము, పోయేటప్పుడు ఏమీ తీసుకుపోము.. మనం చేసే మంచి పనులే మన వెంట వస్తాయి. ఒక మనిషిగా నా బాధ్యతను నెరవేర్చాను,” అని పేర్కొన్నారు. పిలవగానే వచ్చి తమ కుటుంబ సభ్యుడిలా ఆదుకున్న ఆనంద్ కృష్ణారెడ్డిని చూసి కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. “నిజంగా మీరు మాకు దేవుడిలా దొరికారు, ఇలాంటి మంచి మనసున్న నాయకులు ఎప్పుడూ బాగుండాలి,” అని కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# యువత స్వయం ఉపాధితో ముందడుగు వేయాలి

## – సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
## – మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్



**గుమ్మడిదల వాస్తవ తెలంగాణ: న్యూస్** యువత స్వయం ఉపాధితో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మధు గౌడ్ ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా యువత ఆర్థికంగా ముందడుగు వేయొచ్చని తెలిపారు. వ్యాపారాలు గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలను పెంచుతాయని పేర్కొన్నారు. ఇలాంటి యత్నాలు పెరగడం అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. స్వయం ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభికుమార్ గౌడ్ , శ్రీచుర్ణం చక్రపాణి , కత్తుల రమేష్ , అలాగే నాయకులు ఇంద్రసేన రెడ్డి , సత్యనారాయణ , వెంకట్రామిరెడ్డి , పొన్నాల శ్రీనివాస్ రెడ్డి , సదానంద రెడ్డి , ప్రవీణ్ రెడ్డి, శంకర్, మల్లికార్జున గౌడ్ , దాసరి కృష్ణ పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన ఓటర్ జాబితా -- బలమైన ప్రజాస్వామ్యం




**అమీన్‌పూర్ వాస్తవ తెలంగాణ:న్యూస్** బీజేపీ అమీన్‌పూర్ మండల అధ్యక్షుడు ఈర్లా రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన Special Intensive Revision (SIR) అవగాహన సమావేశంలో ఎల్లంకి ఇంజినీరింగ్ కాలేజీలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన పొందారు. ముఖ్యంగా, ఓటర్ జాబితాను ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించడంలో SIR యొక్క ప్రాముఖ్యతను వివరంగా తెలుసుకున్నారు. SIR అంటే ఏమిటి Special Intensive Revision (SIR) అనేది ఎన్నికల కమిషన్ చేపట్టే ఒక ముఖ్యమైన ప్రక్రియ. దీని ద్వారా:కొత్తగా అర్హత పొందిన ఓటర్లను నమోదు చేయడం,డూప్లికేట్ మరియు నకిలీ ఓటర్లను తొలగించడం,ఓటర్ వివరాలలో ఉన్న పొరపాట్లను సరిచేయడం,పూర్తి స్థాయి ఖచ్చితమైన ఓటర్ జాబితా రూపొందించడం సమావేశంలోని ముఖ్యాంశాలు ఇంటింటి ఓటర్ ధృవీకరణ విధానం Booth Level Officers (BLOs) మరియు Booth Level Agents (BLAs) పాత్ర డిజిటల్ యాప్స్ ద్వారా ఓటర్ సేవలు యువత మరియు కొత్త ఓటర్ల నమోదు ప్రాముఖ్యత,ఓటర్ వివరాల చేర్పు, తొలగింపు, సవరణ ప్రక్రియ బీజేపీ కార్యకర్తలకు పిలుపు ఈ సందర్భంగా ఈర్లా రాజు ముదిరాజ్ గారు, నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశంలో అమలవుతున్న పారదర్శక ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త ముందుకు రావాలని పిలుపునిచ్చారు. SIR ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది,నిజమైన ఓటర్లకు న్యాయం జరుగుతుంది,నకిలీ ఓటర్లను తొలగించడంలో ఇది కీలకం.

ప్రజలతో పార్టీకి మరింత అనుసంధానం కలుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ అమీన్‌పూర్ నాయకులు మరియు సభ్యులు:అంజి రెడ్డి (జిల్లా కౌన్సిల్ సభ్యుడు), అనూష (జిల్లా నాయకురాలు), రాజేందర్ గౌడ్ (అమీన్‌పూర్ ఉపాధ్యక్షుడు), వెంకటేష్ (మండల కార్యదర్శి)మండల కౌన్సిల్ సభ్యులు:రాకేష్ కల్వకుంట్ల,సుధాకర్ రెడ్డి సురసాని, సతీష్ రెడ్డి, వేణుగోపాల్,శ్రీనివాస్ వర్మ,విశ్వనాథం. బీజేపీ అమీన్‌పూర్ మండల అధ్యక్షుడు,ఈర్లా రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

# మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్ రెవ డా శామ్యూల్ కోకిల

### పాస్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ:న్యూస్** అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పిజేఆర్ నగర్ కాలనీలోని అపొస్తలిక్ ఫైర్ వర్షిప్ మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్ రెవ డా. శామ్యూల్ కోకిల జన్మదిన వేడుకలకు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శామ్యూల్ కోకిల పాస్టర్ ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసి వారి చేతులమీదుగా పేదప్రజలకు బట్టలు పంపిణి చేయడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు పోశెట్టిగౌడ్, కాశినాథ్ యాదవ్, సంగమేష్, యాదగిరి, రాజుగౌడ్, లకన్ సింగ్, పాస్టర్స్ రెవ ఇజ్రాయెల్, యేసుపాదం, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సందర్శించిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య , బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి





**పటాన్‌చెరు వాస్తవ తెలంగాణ: న్యూస్** పటాన్‌చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్‌లోని ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య గారు, పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి గారు మరియు మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కలిసి సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు నేపథ్యంలో ఇళ్లు కూల్చి అపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రతిపాదనపై కాలనీ ప్రజల అభిప్రా యాలను జిల్లా కలెక్టర్ ప్రవిణ్య గారు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లా డుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో జీఓ 58 మరియు జీఓ 59 ద్వారా తమ ఇళ్లకు రెగ్యులరైజేషన్ పట్టాలు పొందామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి ఇంటి యజమానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినందున, ప్రస్తుతం ఉన్న ఇళ్లను కూల్చి అపార్ట్‌వెంట్‌లుగా నిర్మించాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు తమకు వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. తమకు ఇప్పటికే ఉన్న ఇళ్లలోనే అభివృద్ధి చేసుకునే విధంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే 2017 సంవత్సరంలో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా 221 ఇళ్లు కోల్పోయిన బాధితులకు అప్పట్లో రెవెన్యూ శాఖ ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు కేటాయించలేదని ఆదర్శ్ రెడ్డి కాలనీ ప్రజల తరఫున జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు కోల్పోయిన వారు అద్దె ఇళ్లలో నివసిస్తూ ఇబ్బం దులు పడుతున్నారని, వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో ఉన్న ఇళ్లకు ఇంటి పన్ను విధించే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ ప్రజలు వినిపించిన సమస్యలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య గారు సానుకూ లంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువ కులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం కాకుండా ఉండడం దురదృష్టకరం - సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి





**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ: న్యూస్** పటాన్ చెరు పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం నిర్మించబడిన నూతన గవర్నమెంట్ హాస్పిటల్ సుమారు తొమ్మిది నెలలుగా ప్రారంభం కాకుండా అలాగే నిలిచిపోవడం చాలా దురదృష్టకరం. ఈ హాస్పిటల్ నిర్మాణానికి సుమారు 70% నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల ఇప్పటికీ హాండోవర్ ప్రక్రియ పూర్తికాకుండా, అవసరమైన ఎక్విప్మెంట్లు ఏర్పాటు చేయకుండా తాళాలు వేసి ఉంచడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనం. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డి శ్రీస్వయంగా హాస్పిటల్‌ను సందర్శించి స్పాట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. అక్కడ పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని, కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం ఉపయోగంలో లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రతి రోజు అనేక మంది ప్రజలు సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద మోడల్ హాస్పిటల్ భవనం ఉన్నప్పటికీ, లోపల కనీస సదుపాయాలు లేక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదే. ఈ నిర్లక్ష్యాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ సమస్యపై సోమవారం నాడు సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ ని కలిసి వెంటనే హాస్పిటల్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తాము. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే హాస్పిటల్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాము.

# చలివేంద్రంలో ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ: న్యూస్** ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ చౌరస్తా, జయశంకర్ కాలనీ, పీజేఆర్ నగర్ చౌరస్తా, అల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ మరియు ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి చలివెంద్రాలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# క్రైస్ట్ బిలివర్స్ చర్చ్ 22 వ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ: న్యూస్** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీ లోని క్రైస్ట్ బిలివర్స్ చర్చ్ 22 వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రోజున నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఇరవై రెండు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా చర్చ్ పాస్టర్ శామ్యూల్ కి మరియు నిర్వాకులకు శుభాకాంక్షలు తెలియచేసారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, కాశినాథ్ యాదవ్, జాన్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794